నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్ శనివారం 7 డిసెంబర్ 2024 | ADILABAD NIRMAL




సుంకిడిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

ఇచ్చోడ, డిసెంబర్ 6 : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ గ్రామస్తులకు అండగా ఉండాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సూచించారు. మండలంలోని కొకస్‌మన్నూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు రవీందర్ శుక్రవారం బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, పాండురంగ్, శ్రీకాంత్ రెడ్డి, సాబీర్, వినోద్, వెంకటేశ్, దినేశ్, ప్రకాశ్, చైతన్య పాల్గొన్నారు.



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చాలి

వర్ధంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్, అధికారులు, నాయకులు



ఆదిలాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా. ఎస్పీ గౌష్ ఆలం, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, డిసెంబర్ 6: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కెడెట్లు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దాసరి రమేశ్. అజయ్, సాజిదొద్దీన్, నారాయణ, మమత, శివ కుమార్, ప్రశాంత్ సమత సైనిక్ దళ్ జిల్లా, పట్టణ సంఘటకులు రమాకాంత్ కాంబ్లే, జైపాల్ బాలెరావ్, రవిచంద్ర జాబాడే, శీలానంద్, హర్షవర్ధన్ వాఘ్మారే, గంగారాం, అశ్విని, అమ్రపాలి వాఘ్మరే, అరుణ, ధన శ్రీ వాఘ్మారే తదితరులు పాల్గొన్నారు.

### గొప్ప వ్యక్తి అంబేద్కర్..

ఎదులాపురం, డిసెంబర్ 6: ప్రపంచ దేశాల్లో ఏ దేశానికి లేని విధంగా గొప్ప రాజ్యాంగాన్ని భారత దేశానికి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టర్ రాజర్షి షా. ఎస్పీ గౌష్ ఆలం, డీఎస్పీ డీవో భగత్ సునీత కుమారితో కలిసి అంబేద్కర్ చౌక్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం మాట్లాడుతూ అన్ని కులాలు, మతాలకు సమానంగా హక్కులు కల్పించేలా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు రత్నజాడే ప్రజ్ఞాకుమార్, సమత సైనిక్ దళ్ జిల్లా సంఘటకులు రమాకాంత్ కాంబ్లే, తదితరులు పాల్గొన్నారు.

### సుంకిడిలో..

తలమడుగు, డిసెంబర్ 6 : అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని సుంకిడి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కులస్తులు, బీఆర్ఎస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు

# నిలిచిన సోయా కొనుగోళ్లు

వాతావరణ పరిస్థితులే కారణమంటున్న అధికారులు

● నాఫెడ్ కోటా పూర్తయిందనే కొనుగోళ్లు బంద్ !
● ఇండ్ల వద్దనే పంట నిల్వలు
● మిగిలిన పంటను కొనాలని రైతుల వినతి



నాలుగు రోజుల కిందట ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో విక్రయానికి వచ్చిన సోయాబీన్

ఆదిలాబాద్, డిసెంబర్ 6 ( నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో సోయాబీన్ పంట కొనుగోళ్లు రెండ్రోజులుగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో పలు చోట్ల వర్షం కురుస్తున్నందున పంటలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో పాటు పంటను మార్కెట్‌కు తీసుకురావడంలో రైతులకు ఇబ్బందిగా మారిందనే కారణంతో సోయాబిన్ కొనుగోళ్లను నిలిపివేసినట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో రెండు నెలల కిందట సోయాబీన్ కొనుగోళ్లు ప్రారంభం కాగా ఇప్పటి వరకు 2.50 లక్షల క్వింటాళ్ల పంటను సేకరించారు. ఆదిలాబాద్, ఇచ్చోడ, బోథ్, ఇంద్రవెల్లి, బేల, తాంసి, నార్నూర్, జైనథ్, నేరడిగొండ మార్కెట్‌యార్డుల్లో పంట కొనుగోళ్లను ప్రారంభించి, ఆయా మండలాల ప్రాథమిక సహకార సంఘాల ద్వారా పంటను కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పంటను కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

### రైతుల వద్దనే పంట నిల్వలు..

జిల్లాలో ఈ ఏడాది వానకాలంలో రైతులు 71, 226 ఎకరాల్లో రైతులు సోయాబీన్ సాగు చేశారు. వాతావరణం, వర్షాలు అనుకూలంగా ఉండడంతో ఆదిలాబాద్ ప్రాంతంలో పంట దిగుబడులు బాగా ఉండగా, మిగతా ప్రాంతాల్లో సాధారణంగా ఉన్నాయి. ఆదిలాబాద్‌రూరల్, మావల, జైనథ్, బేల, తాంసి, తలమడుగు మండలాల్లో రైతులు ఎకరాకు 10 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. రైతులు పంటను విక్రయించేందుకు ఆదిలాబాద్, జైనథ్, తాంసి మార్కెట్ యార్డులకు పెద్ద మొత్తంలో తీసుకువచ్చారు. జిల్లాలో ఇప్పటి వరకు 2.50 లక్షల క్వింటాళ్ల పంటను సేకరించారు. పలు మార్లు క్యూఆర్ కోడ్, మార్కెట్‌యార్డుల్లో పంట నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లలో సమస్యలు తలెత్తాయి. ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో రెండ్రోజులుగా పంట కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఆదిలాబాద్, జైనథ్, బేల మార్కెట్‌యార్డుల పరిధిలో రైతులు ఇండ్లలోనే పంటలు నిల్వ చేసుకున్నారు. 3 రోజులుగా వర్షం కురుస్తున్నందున సోయా కొనుగోళ్లు నిలిపివేశామని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో కేంద్ర ప్రభుత్వం సంస్థ నాఫెడ్ కోటా ముగిసినందునే పంట కొనుగోళ్లు నిలిచిపోయినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా మిగతా పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మిగతా పంట కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో ఖాళీగా ఉన్న సోయాబీన్ కొనుగోలు కేంద్రం

## నిరసన చేపట్టి..ఎంపీడీవోతో క్షమాపణ చెప్పించి

తాంసి, డిసెంబర్ 6 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దళిత సంఘం నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనాలని ఎంపీడీవో మోహన్ రెడ్డిని దళిత సంఘం నాయకులు కోరగా ఆయన నిరాకరించారు. ఎంపీడీవోపై నాయకులు మండిపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను చులకన చేసి మాట్లాడడం సరి కాదని, వెంటనే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. కొద్దిసేపటికి ఎంపీడీవో వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి క్షమాపణ చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవో క్షమాపణ చెప్పాలని ఆందోళన చేస్తున్న దళిత సంఘం నాయకులు

## ఒకరికి బదులుగా మరొకరు విధులు

● ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
● తాడిహత్నూర్ ఎస్ఆర్పీకి షోకాజ్ నోటీసు

నార్నూర్, డిసెంబర్ 6 : నార్నూర్ మండలంలో గంగాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విధులకు హాజరుకాకుండా తన స్థానంలో వేరొక ఉపాధ్యాయుడిని స్వయంగా నియమించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యశ్వంత్‌ను ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సస్పెండ్ చేశారు. మండలంలోని దేవరిగూడ, గంగాపూర్, నాగలకొండ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. దేవరిగూడలో పాఠశాల ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకపోవడం, పాఠశాల తెరవకపోవడాన్ని గమనించారు. గంగాపూర్ పాఠశాలలో మెనూ పాటించకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ రద్దు చేయాలని ఆదేశించారు. తాడిహత్నూర్ ఎస్ఆర్పీకి షోకజ్ నోటీసు జారీ చేశారు. దేవరిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ విధులో అలసత్వం ప్రదర్శించినందుకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వలేనందున ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డీడబ్ల్యూవో ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లకు హెచ్చరించారు.



పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



జున్నపానిలో పులిని చూసినట్లు చెబుతున్న గిరిజన మహిళలు

## జామిని, జున్నపాని ప్రాంతాల్లో పులి సంచారం

జైనథ్, డిసెంబర్ 6 : ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాలైన జామిని జున్నపాని గ్రామాల్లోని పత్తి చేలలో శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో పులి సంచరించిందని గిరిజన మహిళలు, రైతులు తెలిపారు. జామిని, జున్నపాని గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీల కథనం ప్రకారం..జున్నపాని గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు సిడాం లక్ష్మీబాయి, సిడాం భీంబాయి తమ పంట పొలాల్లో పత్తి ఏరుతుండగా పులిని చూశామని, వెంటనే అక్కడి నుంచి పరుగులు తీసినట్లు తెలిపారు. దీంతో కూలీలు, రైతులు భయాందోళనకు గురయ్యారు. జామిని మాజీ సర్పంచ్ పెందుర్ దేవన్న ఫారెస్ట్ అధికారి రాజేందర్‌కు సమాచారం అందించారు.

## వర్షంతో రైతులకు తంటాలు

కుంటాల / కుభీర్, డిసెంబర్ 6: కుంటాల మండల కేంద్రంతో పాటు వెంకూర్, అంబకంటి తదితర గ్రామాల్లో శుక్రవారం వర్షం కురిసింది. చేలలో చెట్లపై ఉన్న పత్తి తడిసింది. కొనుగోలు కేంద్రాల్లోని కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని కాపాడుకోడానికి రైతులు టార్పాలిన్ కప్పుతూ తిప్పలు పడ్డారు. కుభీర్ మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కురిసింది. చేలలో ఉన్న పత్తి తడిసింది. కంది పంటలో పూత రాలే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



కుంటాల : కొనుగోలు కేంద్రంలోని ధాన్యంపై కప్పిన కవర్లు

# విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలి

ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్

● ఆకట్టుకున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ● వినూత్న ఎగ్జిబిట్లతో ప్రతిభ చూపిన విద్యార్థులు

ఎదులాపురం, డిసెంబర్ 6: విద్యార్థుల్లో సైన్స్ పరిజ్ఞానం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కాన్వెంట్ స్కూల్లో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించి ఎగ్జిబిట్లను చూసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... చదువుతో పాటు సైన్స్ పరిజ్ఞానం కూడా ఎంతో ముఖ్యమన్నారు. పుస్తకాల్లోని అంశాలను వాస్తవిక రూపంలో సరి చూస్తూ వినూత్నంగా ఆలోచిస్తూ సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాలని సూచించారు. ఇందుకు ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించాలన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ పిల్లల ఆలోచనలు, ప్రదర్శనలు చూస్తే భవిష్యత్ శాస్త్రవేత్తలు ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో 3వ స్థానం పొందిన సరస్వతీ నగర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థులు యోగాసనాలు వేసి అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రఘురమణ, సెక్టోరియల్ అధికారి నారాయణ, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మారియ రోజ్, ట్రస్మా ప్రతినిధులు రంగినేని పవన్‌రావు, ఆదినాథ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులున్నారు.

### వైజ్ఞానిక ప్రదర్శనలతో నైపుణ్యాలు మెరుగుపడుతాయి

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 6 : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు, ప్రశ్నించే తత్వం, కొత్త విషయాలు నేర్చుకోవాలని ఆసక్తి పెరుగుతుందని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని సెయింట్ థామస్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ముఖ్య అతిథులతో కలిసి ప్రారంభించారు. ముందుగా మామడ మండలం పొన్కల్ ప్రభుత్వ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను చూసి వారిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణ రూపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఈవో రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, తహసీల్దార్ రాజు, ఏసీజీఈ పద్మ, సెక్టోరియల్ అధికారి సలోమి కరుణ, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులున్నారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్



ప్రదర్శనలను తిలకిస్తున్న నిర్మల్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

## జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌కు మాజీ మంత్రి జోగు రామన్న వినతి

ఎదులాపురం, డిసెంబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుటుంబ, కుల గణన సర్వే పూర్తయిన తర్వాత జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న కోరారు. రిజర్వేషన్లపై వినతులు, సలహాల స్వీకరణ నిమిత్తం జిల్లాలో పర్యటించిన డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. జనాభాలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా తొమ్మిదవ షెడ్యూల్‌లో ఈ అంశాన్ని చేర్చిన తర్వాతనే కేంద్రానికి నివేదిక అందించాలన్నారు. తద్వారా రిజర్వేషన్ల ప్రక్రియ సులువవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీడీడబ్ల్యూవో రాజలింగు, బీఆర్ఎస్ నాయకులు దాసరి రమేశ్, నవతే శ్రీనివాస్, బొడగం మమత, కరుణ, ఉగ్గే విఠల్, తదితరులు పాల్గొన్నారు.



డెడికేషన్ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

### వినతులను ప్రభుత్వానికి అందజేస్తాం

స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా బీసీ గణన కోసం ప్రత్యేకంగా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చాంబర్‌లో రిజర్వేషన్ల విషయంలో ఉమ్మడి జిల్లా బీసీ సంఘాలు, ఇతర నాయకులతో పాటు ఆదిలాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జుపటేల్ అందించిన 24 వినతి పత్రాలను స్వీకరించారు.ఆదిలాబాద్‌తో కలిపి తొమ్మిది జిల్లాల పర్యటన పూర్తయిందని చైర్మన్ తెలిపారు. ప్రజలు, బీసీ సంఘాలు, ప్రజాప్రతినిధుల నుంచి స్వీకరించిన వినతి పత్రాలను ప్రభుత్వానికి అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ కార్యదర్శి బీ.సైదులు, ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అధికారులు, తదితరులు ఉన్నారు.